క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్తబజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ నవ్య ఆదివారం తెలిపారు. కొత్త బజారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏరియాలోని ఫీడర్‌లైన్‌లో మధ్య పోల్స్ వేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వెంకటేశ్వర బజారు, కంకరబోర్డు, ఇందిరాకాలనీ, సిగ్నల్ కాలనీ, కృష్ణ కాలనీ, బ్యాంకు కాలనీ, ఎన్జీఓస్ కాలనీ ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి



గూడూరు: రాష్ట్ర ఏర్పాటులో ముందు వరుసలో నిలిచిన ఉద్యమ కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని జిల్లా ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ మేరుగు భద్రయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన ఉద్యమ కళాకారులను గుర్తించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో కొంతమంది పైరవీదారులకే గుర్తింపు దక్కిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేసి నిజమైన కళాకారులను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డుకు కృషి చేయాలి



మహబూబాబాద్ అర్బన్: 32 ఏళ్ల నుంచి మొక్కలు నాటి వాటిని సంరక్షించి తన సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డుకు కృషి చేయాలని ప్రకృతి, వనప్రేమికుడు దైద వెంకన్న అన్నారు. హైదరాబాద్ భర్కత్‌పురం కేంద్ర మంత్రి క్యాంప్ కార్యాలయంలో పద్మశ్రీ అవార్డు అందించాలని ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

రూ.40వేల ఆర్థికసాయం



నెల్లికుదురు: మండల కేంద్రానికి చెందిన అలువాల రాజు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. తనతో కలిసి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబానికి ఆదివారం రూ.40వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అశోక్, సునీల్ కుమార్, సైదులు, రాణి, బిస్మిల్లా, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు..

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన నాళ్ళం స్వాతిక ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. స్పందించిన ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్‌లో 2021–22 బ్యాచ్ విద్యార్థులు రూ.10వేలు, 50కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, లిఖిత, జ్యోత్స్న, నాని, మహేష్, మౌనిక, వెంకటేష్, భువన్, శేషు, అరవింద్, రాకేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రచారసభ గౌరవ అధ్యక్షుడిగా పెద్దినేని



బయ్యారం: అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచారసభ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బయ్యారానికి చెందిన పెద్దినేని వెంకటేశ్వరరావును నియమించారు. ఆదివారం బయ్యారంలోని రామచంద్రస్వామి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నియామకం జరిగింది. ఈసమావేశంను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షుడు టిపుల్లంరాజు మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రచారసభ రాష్ట్ర కార్యదర్శి సిద్ధు, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గుప్తా, భాస్కర్, ఏడుకొండలు, గురవయ్య, సాగర్‌గౌడ్, భాస్కరాచారి, ఉప్పలయ్య, శ్రీనివాసాచారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్లు

డోర్నకల్: డోర్నకల్ పట్టణ శివారులోని మున్నేరు వాగు వద్ద ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డోర్నకల్ పట్టణానికి తాగునీటిని సరఫరా చేసేందుకు మున్నేరువాగు వద్ద 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రెండు 30హెచ్‌పీ విద్యుత్ మోటార్ల ద్వారా డోర్నకల్ మున్సిపాలిటీ కార్యాలయంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసేవారు. భగీరథ నీటి సరఫరాతో ఇక్కడి నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు విద్యుత్ మోటార్లు నిరుపయోగంగా మారాయి. ఇదే ప్రాంతంలో మున్నేరువాగు నుంచి పెద్ద చెరువుకు నీటిని ఎత్తిపోసేందుకు లిఫ్టును ఏర్పాటు చేశారు. ఇందు కోసం 63కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు విద్యుత్ మోటార్లను అమర్చారు. పలు కారణాలతో పెద్దచెరువుకు నీటిని ఎత్తిపోసే పనులు నిలిచిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ మోటార్లు నిరుపయోగంగా మారాయి. సెప్టెంబర్ మొదటి వారంలో భారీ వర్షాలతో మున్నేరువాగుకు వరద పోటెత్తి వారంరోజులపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నీటి మునిగి ధ్వంసమయ్యాయి. మున్సిపాటీలికి నీటి తరలింపునకు వినియోగించే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు చెట్లు, చెత్త పేరుకుపోయి వాటి మధ్యలో కూరుకుపోయింది. చాలా కాలంగా వినియోగించకపోడంతో ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి భగీరథ నీటి సరఫరా నిలిచిన సమయంలో మున్నేరువాగు నుంచి నీటిని తరలించేలా, లిఫ్టుకు మరమ్మతులు చేసి పెద్దచెరువును మున్నేరు నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



మున్నేరువాగు ఒడ్డున చెత్తలో కూరుకుపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కనెక్షన్ వైర్లు వరదలో కొట్టుకుపోయి ప్లాట్‌ఫాంపై మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్

గూడూరును రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలి



అభివాదం చేస్తున్న గిరిజనేతరులు

గూడూరు: గూడూరు మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని, గిరిజనేతరుల ఆస్తులకు, హక్కులకు రక్షణ కల్పించాలని నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి కోరారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో ఆదివారం ధర్మయుద్ధం పేరుతో నాన్ ట్రైబల్ గ్రామ ప్రజల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. వెయ్యి మందికి పైగా హాజరైన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజనేతరులను జీపీకి సంబంధంలేని ఓ వ్యక్తి ఇటీవల కుల సంఘం పేరుతో గిరిజనేతరులను బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. జాతీయ రహదారి కలిగి గిరిజనేతరులు ఎక్కువగా ఉన్న గూడూరు గ్రామ పంచాయతీ ఏజెన్సీ పేరుతో అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. అందుకోసమే గిరిజనేతరులంతా ఏకమై రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు నాన్ ట్రైబల్ సంఘం పేరుతో ఉద్యమం ప్రారంభించడం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో నాన్ ట్రైబల్ సంఘం ప్రతినిధులు మేరెడ్డి సురేందర్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, నూకల ఉపేందర్‌యాదవ్, నాయకులు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, మాజీ ఎంపీపీ చెల్పూరు వెంకన్న, మాజీ జెడ్పీ కోఆప్షన్ ఎండీ. ఖాసీం, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, రిటైర్డ్ హెచ్‌ఎం చీర భిక్షపతి పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి చేసుకోవాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రెడ్యానాయక్

చిన్నగూడూరు: నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన బాల్యతండాను సమష్టి కృషితో అభివృద్ధి చేసుకోవాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కోరాడు. ఆదివారం మండలంలోని ఉగ్గంపల్లి పరిధిలోని మంచ్యాతండాలో కురవి మండలం బాల్యతండా నుంచి 10 కుటుంబాలకు చెందిన 50మంది తండావాసులు మాజీ ఎమ్మెల్యే రెడ్యా సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బానోత్ ధర్మానాయక్, భూక్య రాములు, బాదావత్ కిషన్, భూక్య దేవ్‌సింగ్, భూక్య రమేష్, భూక్య రవి, గుగులోత్ హతిరామ్, బానోత్ శంకర్, భూక్య శంకర్ ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గుగులోత్ రవినాయక్, మల్లెపాక మధు, గుండోజు శ్రీనివాస్, జక్కుల సందీప్, జాటోత్ కొండయ్య, బానోత్ రాందాస్. తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

నెహ్రూసెంటర్: ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. గాంధీపురం శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎర్రజెండా పోరాటాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. హామీలను విస్మరిస్తే ప్రజా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాసభలో గండమల్ల ఉప్పలయ్య, నర్సయ్య, కాగితపు నర్సయ్య, బండారి లింగయ్య పాల్గొన్నారు. నూతన శాఖ కార్యదర్శిగా తీగల ఉప్పలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజమౌళి తెలిపారు.



మాట్లాడుతున్న రాజమౌళి

పెండింగ్ డీఏలు చెల్లించాలి



మాట్లాడుతున్న భిక్షపతి

మహబూబాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఏర్పడగానే తక్షణమే అన్నిరకాల పెండింగ్ బిల్లులు డీఏలను చెల్లిస్తామని హామీ ఇచ్చారని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఘణపురం భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను తీరుస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10నెలలు గడుస్తున్న డీఏలు ప్రకటించలేదన్నారు. ఊరించి ఊరించి చివరికి ఉపాధ్యాయుల ఆకాంక్షలకు విరుద్ధంగా చేస్తున్నారని, ఒక డీఏను ప్రకటించారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను, అన్నిరకాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిలర్ చిందం శ్రీనివాస్, సీనియర్ నాయకులు బానోత్ రవీందర్, అక్కినపల్లి బాబురావు, సిరికొండ నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధిద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దంతాలపల్లి: భారత విప్లవోద్యమ అమరవీరుల ఆశయాలను సాధిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు రాజేశ్వర్ రెడ్డి, తొర్రూర్ డివిజన్ నాయకులు ఉడుగుల రాములు, సంయుక్త మండల సహాయ కార్యదర్శి సెగ్గం యాకయ్య అన్నారు. ఆదివారం మండలంలోని దంతాలపల్లి, పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల గ్రామాలలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలపై సాగుతున్న దోపిడీ అణిచివేత వివక్షతలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ, సమరశీల పోరాటాలు, రైతాంగ పోరాటాలలో వేలాదిమంది తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి త్యాగం చేశారన్నారు. అమరవీరుల ఆశయాలను విప్లవ లక్ష్యాలను గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేయటానికి నవంబర్ 1నుంచి 9 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకులు వెంకన్న, యాకన్న, ప్రవీణ్, కొముర్రయ్య, శ్రీను, మధు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కళాశాల ఏర్పాటు చేయాలి

డోర్నకల్: డోర్నకల్‌కు ఇంటిగ్రేటెడ్ కళాశాలను మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ విద్యా సముదాయాన్ని డోర్నకల్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. డోర్నకల్‌లో ప్రభుత్వ స్థలం లేదనే సాకుతో అనేక ప్రభుత్వ కార్యాలయాలను, విద్యాసంస్థలను ఇక్కడి తరలిస్తూ పక్షపాత ధోరణి అవలంబిస్తూ ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలం లేకపోతే ప్రైవేట్ స్థలాలను కొనుగోలు చేసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థను ఏర్పాటు చేయాలని హరికృష్ణ కోరారు.

హామీలు విస్మరించడం బాధాకరం

బయ్యారం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండా ఒక డీఏను మాత్రమే మంజూరు చేయటం తగదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు బానోత్ దేవేందర్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించటం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు పాత తండా నుంచి అక్రమంగా ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తీసుకువస్తున్న సురేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి ఆదివారం తెలిపారు.

అంబేడ్కర్ జీవితం భావితరాలకు ఆదర్శం

● ఎమ్మెల్యే కోరం కనకయ్య



అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనా విధానం భావితరాలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బాపనపల్లి సుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని చిన్నబంజర గ్రామంలో మోతీలాల్ వితరణ చేసిన సిమెంట్ బెంచీలను ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, జిల్లా నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా నాగేశ్వరరావు, కట్టా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గంగావత్ రాంసింగ్, హతీరాం, శీలంశెట్టి ప్రవీణ్‌నాయుడు, సైదయ్య, లెనిన్, శంషాద్‌బేగం, అశోక్, రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తొర్రూరు రూరల్: ప్రజాసేవ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు మరింత భాగస్వామ్యం కావాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని రామ ఉపేందర్ గార్డెన్‌లో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో పొద్దుటూరి గౌరిశంకర్ సేవా పురస్కార కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులు, పేద మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు వాసవి క్లబ్ చేపడుతున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని గజమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఇరుకుల్ల రామకృష్ణ, గార్లపాటి శ్రీనివాస్, సంతోష్‌కుమార్, కిశోర్‌కుమార్, జ్ఞానేశ్వర్, రామ ఉపేందర్, వైద్యనాథ్, వెంకటేశ్వర్లు, ప్రమోద్‌కుమార్, నవీన్‌కుమార్, రాంమూర్తి, శ్రీధర్, మహేష్, రవి, వెంకన్న, అనిల్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తీసుకోవాలి

గార్ల: బాణసంచా దుకాణాలు లైసెన్స్ లేకుండా నిర్వహించరాదని గార్ల బయ్యారం సీఐ రవికుమార్ హెచ్చరించారు. ఆదివారం గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌డీఓ వద్ద అనుమతి తీసుకున్న వారికే టపాసు దుకాణాలు నిర్వహించుకోవాలని సూచించారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు పెట్టుకోవాలన్నారు. క్రాకర్స్ వలన కాలుష్యం పెరుగుతున్నందున పండుగ మరుసటి రోజు ప్రతీ ఇంట్లో ఒక మొక్క నాటాలని సీఐ మండల ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై జీనత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గార్ల: మాట్లాడుతున్న సీఐ రవికుమార్

నిబంధనలు పాటించాలి

బయ్యారం: దీపావళి మందులు విక్రయించే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో దీపావళి మందుల విక్రయానికి లైసెన్స్ పొందిన వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. మందులు విక్రయిస్తున్న ప్రాంతంలో అగ్నిప్రమాద నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

రూ.48లక్షలతో వాహనాల కొనుగోలు

తొర్రూరు: పట్టణంలో చెత్త తరలింపు కోసం మున్సిపాలిటీ అధికారులు రూ.48 లక్షలు వెచ్చించి కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. రెండు ట్రాక్టర్లకు రూ.32లక్షలు, డోజర్‌కు రూ.16లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి మూడు ట్రాక్టర్లు, 4మినీ ఆటోలు ఉన్నాయి. వాటిపై అధిక భారం పడుతుండడంతో మరో రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకున్నారు. కొత్త ట్రాక్టర్ల కొనుగోలుతో అద్దె భారం తప్పనుంది. మున్సిపాలిటీలో 58 మంది పారిశుద్య కార్మికులుండగా ప్రతి రోజు 8టన్నుల చెత్త డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. కొత్త వాహనాల కొనుగోలుతో చెత్త తరలింపు సమస తీరనుందని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని కమిషనర్ శాంతికుమార్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పేదలను ఆదుకోవడమే 'బెస్ట్ ఫ్రెండ్స్' లక్ష్యం

గూడూరు: పేద విద్యార్థులతోపాటు విద్యలో వెనుకబడిన, ఆపదలో ఉన్న వారికి సహాయ సహకారాలు అందించడమే బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ లక్ష్యమని వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్ క్యూ న్యూస్ కార్యాలయంలో ఆదివారం ఫౌండేషన్ సభ్యులతో కలిసి దేవేందర్ ముదిరాజ్ మల్లన్నకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పోతుగంటి కిషన్, రాచర్ల శ్రీనివాస్, జన్ను రాజమౌళి, పతంగి భాస్కర్, మధు, బోనాల రమేష్, గరిపెల్లి శ్రీనివాస్, అజీజ్, స్వరూప, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

గూడూరు: గూడూరు గ్రామాన్ని రెవెన్యూ డివిజన్‌గా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాన్ ట్రైబల్ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈసందర్భంగా పట్టణ కేంద్రంలోని అన్నిరకాల వర్తక వ్యాపార సంస్థల యజమానులు బంద్‌కు సంపూర్ణ మద్దతు పలికారు. కార్యక్రమంలో నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి, మేరెడ్డి సురేందర్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, నూకల ఉపేందర్‌యాదవ్, పేరాల రాము, పూర్ణచందర్, వల్లెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సస్పెన్షన్ చేసే అధికారం ఎవరికి లేదు'

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో బీజేపీ నాయకులకు నోటీసులు, సస్పెండ్ చేసే అధికారం లేదని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు ఆదివారం తెలిపారు. ఈనెల 25న బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు ప్రకటనలో తెలియజేశారని, యాథావిధిగా మహేష్ పార్టీలోనే కొనసాగుతారన్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా పార్టీ సభ్యత్వాలు మాత్రమే చేయాలని ఆయన జిల్లా నాయకులకు సూచించారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డలో గల పాత హనుమాన్ గుడి అభివృద్ధి, నిర్మాణంపై హనుమంతునిగడ్డ స్థానికులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. దాతలు, భక్తులు, ప్రజలను కలుపుకుని గుడి అభివృద్ధి కోసం త్వరలో ఒక అభిప్రాయం తీసుకుని కమిటీ పునర్నిర్మాణం చేపట్టి నూతన అంజన్న దేవాలయం నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మధు



బయ్యారం: సీపీఎం మండల కార్యదర్శిగా నంబూరి మధు మరోసారి ఎన్నికయ్యారు. బయ్యారంలో నిర్వహించిన మండల మహాసభలో మధును కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా నాయకుడు మండా రాజన్న ఆదివారం తెలిపారు. ఇదేవిధంగా తొమ్మిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

పరామర్శ

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన జక్కుల భాగ్యమ్మ(37) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఉగ్గంపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు భర్తాపురం కొమురెల్లి, జక్కుల వెంకన్న, కొంపెల్లి రవి, జుజ్జూరి అనిల్, మునిగేటి మల్లయ్య, యాకయ్య, తదితరులు ఉన్నారు.

కఠిన శిక్ష విధించాలి

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో గుమ్మడి మహేష్‌ను అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఆదివాసీ సంఘం ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర డిమాండ్ చేశారు. ఆదివారం సీతంపేట గ్రామంలో మహేష్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు.

ప్రెస్ క్లబ్ నూతన కమిటీల ఎన్నిక

దంతాలపల్లి: మండలకేంద్రంలోని సాయి బాలాజీ గార్డెన్‌లో మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎర్రబోయిన మురళీ, ప్రధాన కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షుడిగా బూతం రమేశ్, కోశాధికారిగా గుగులోత్ రమేశ్, ప్రచార కార్యదర్శిగా పడిదం నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నర్సింహులపేటలో..

నర్సింహులపేట: నర్సింహులపేట మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎరగాని వెంకన్న ఎన్నికయ్యాడు. ఆదివారం మండల కేంద్రంలో సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సలుగు అనంద్, భూక్య రమేశ్, ప్రధాన కార్యదర్శి కోల యాకయ్య, కోశాధికారి చలమల్ల గణేష్, దాడుల కమిటీ చైర్మన్ నిమ్మల నరేష్‌లను ఎన్నుకున్నారు.

3న వనసమారాధన

మహబూబాబాద్ రూరల్: శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీన వనసమారాధన మహోత్సవం నిర్వహిస్తున్నామని శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు కార్యక్రమ నిర్వహణ బాధ్యులు ఎస్వీ నాగేశ్వర్ రావు, రామారావు, సోమ శ్రీనివాస్, రాంబాబు ఆదివారం తెలిపారు. కార్తీక మాస విశిష్టతను పురస్కరించుకుని కేసముద్రం రోడ్డులో గల ఉసిరి తోటలో మహోత్సవం ఏర్పాటు చేశామన్నారు. పాల్గొనదలచిన వారు ఈనెల 31వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ షరీఫ్ వేడుకలు

మహబూబాబాద్ రూరల్: గ్యార్మీ షరీఫ్ వేడుకలను జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రాంతంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక యువకులు, పెద్దలు జెండాలను బ్యాండు వాయిద్యాలతో జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

పనులు చేయకుండానే బిల్లులు డ్రా



కొత్తగూడ: పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసినట్లు ఓటాయి గ్రామ సామాజిక తనిఖీల్లో గుర్తించినట్లు ఆదివారం జరిగిన గ్రామ సభలో వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కొత్తగూడ మండలానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇదే అదునుగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ తన చేతి వాటాన్ని చూపించి స్థానికులతో కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేసినట్లు స్థానికులు ఆరోపించారు. కాగా తమకు మంజూరు అయిన సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు గ్రామసభలో వినతి పత్రం అందజేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇదిలా ఉండగా చెరవుముందు తండా గ్రామాల్లో గ్రామసభ జరిగింది. నేడు సామాజిక తనిఖీ మండల సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్రప్రసాద్ తెలిపారు.